సాక్షి
పశ్చిమగోదావరి
శనివారం । 10 । మే । 2025





## మెరిసిన శ్రీవారు

ద్వారకాతిరుమల చినవెంకన్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సూర్య, చంద్ర ప్రభలపై మెరవగా.. కనులారా వీక్షించిన భక్తజనులు పులకించారు. 12లో



## ముగిసిన వర్క్‌షాప్

ఆర్జీయూకేటీ, వాద్వానీ ఫౌండేషన్ సంయుక్తంగా నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్‌పై నిర్వహించిన వర్క్‌షాప్ ముగిసింది. 12లో




## మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు

కైకలూరులో మీసాల వెంకన్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 12 వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. 12లో

# కూటమిలో కుట్టు రగడ

**పల్లెల్లో కుమ్ములాట**

- ఉమ్మడి జిల్లాకు 42 వేల కుట్టుమెషీన్లు
- నియోజకవర్గానికి 3 వేల యూనిట్ల మంజూరు
- ఎమ్మెల్యే చెప్పిందే ఫైనల్ అంటూ అధికారుల పరోక్ష ఆదేశాలు
- సింహభాగం తమకే అంటున్న టీడీపీ వర్గాలు
- జనసేన, బీజేపీకీ వాటా కావాలంటూ పంచాయితీలు
- జనసేన ఎమ్మెల్యేలు ఉన్న చోటా టీడీపీకే ప్రాధాన్యం
- దరఖాస్తుల దశలోనే తీవ్రమవుతున్న రగడ



సాక్షిప్రతినిధి,ఏలూరు: కూటమి పార్టీలో కుట్టుమెషీన్ల పంచాయితీ షురూ అయ్యింది. బీసీ కార్పొరేషన్ ద్వారా నియోజకవర్గానికి 3 వేల కుట్టుమెషీన్లు పంపిణీకి సిద్ధం చేశారు. ఈ క్రమంలో తమ పార్టీలకు వాటా ఇవ్వాలని జనసేన, బీజేపీ నేతలు నియోజకవర్గాల్లో కోరుతుంటే మొత్తం తమకే లేదంటే ఇచ్చిన నాలుగైదు తీసుకోండి అంటూ టీడీపీ నేతలు హుకుం జారీ చేయడంతో పల్లెల్లో రగడ మొదలైంది. ఇప్పటికే కూటమి పార్టీలో పదవుల పందారాలు, అక్రమ గ్రావెల్ దందా అన్నింటిలోనూ వాటాల విషయంలో ఘర్షణ కొనసాగడంతో పాటు ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర ముఖ్యుల వద్ద సెటిల్‌మెంట్లు జరిగినా పరిష్కారం కాని పరిస్థితి. ఈ తరుణంలో కుట్టుమెషీన్ల వ్యవహారం మరోసారి అలజడి రేపింది.

### రూ.60 కోట్లకు పైగా పక్కదారి

బీసీ కార్పొరేషన్ ద్వారా కుట్టుమెషీన్ల పంపిణీ పేరుతో సర్కారు భారీ స్కామ్‌కు తెరతీసింది. రూ.4 వేల నుంచి రూ.5 వేలు విలువ చేసే కుట్టుమెషీన్, 45 రోజుల శిక్షణ అన్నీ కలిపి ఒకరికి రూ.21,500లు ధరగా నిర్ణయించారు. మెషీన్ ఖరీదు రూ.5 వేలు కాగా 75 శాతానికిపైగా స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా కుట్టుమెషీన్ల శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నాయి. లేదంటే శిక్షణకు మనిషికి రూ.2 వేలకు మించి తీసుకోరు. అయితే ప్రభుత్వం ఏకంగా ఒక లబ్ధిదారుకు రూ.21,500 చొప్పున ఉమ్మడి జిల్లాలో రూ.90.30 కోట్లు ఖర్చుగా చూపించారు. దీనిలో సుమారు రూ.60 కోట్లకుపైగా పక్కదారి పట్టే అవకాశం ఉంది. గత నెలలో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రకటించి ఏప్రిల్ 25 వరకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తులు ఎంపీడీఓల ద్వారా బీసీ కార్పొరేషన్‌కు అందుతాయి. అర్హులను ఎంపిక చేసి ప్రతి నియోజకవర్గంలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేసి 45 రోజులు శిక్షణ ఇచ్చి అందులో 75 శాతం హాజరు ఉంటేనే లబ్ధిదారులకు మెషీన్లు పంపిణీ చేసేలా నిబంధనలు రూపొందించారు.

### ఎమ్మెల్యే చెబితేనే ఫైనల్

ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎంపీడీఓ కార్యాలయాలకు చేరిన దరఖాస్తులను ఎమ్మెల్యే కార్యాలయంతో సంప్రదించడం, లేదంటే జాబితా ఎమ్మెల్యేకు పంపి వాళ్లు ఫైనల్ చేసిన వాటినే ఆమోదిస్తున్నారు. అది కూడా మండల, గ్రామ నాయకులు చెప్పిన వారికే ఇస్తూ జనసేన, బీజేపీ నాయకులను విస్మరిస్తున్నారు. బీజేపీ ఎమ్మెల్యే ఉన్నచోట అయితే కనీసం ఆ పార్టీ వారిని నామమాత్రంగా పట్టించుకోని పరిస్థితి. ఉంగుటూరు, తాడేపల్లిగూడెం, నరసాపురంలో రెండు పార్టీల ముఖ్యుల మధ్య తర్జనభర్జనలు, వివాదాలు కొనసాగుతున్నాయి. పోలవరం, ఉంగుటూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురంలో జనసేన ఎమ్మెల్యేలున్నా టీడీపీ నేతలే మండల, గ్రామస్థాయిలో తమకు యూనిట్లు కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక ఏలూరు, దెందులూరు, చింతలపూడి, నూజివీడు, తణుకు, పాలకొల్లు వంటి నియోజకవర్గాల్లో జనసేనకు అతికష్టం మీద ఐదో, పదో యూనిట్లు కేటాయిస్తున్నారు. జిల్లాలో 40 శాతం జనసేన నాయకులు చెప్పిన వారికి రావాల్సి ఉన్నా ప్రతిచోటా టీడీపీ ఉద్దేశపూర్వకంగా తమను విస్మరిస్తుందని ఇన్‌చార్జి మంత్రికి జనసేన ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

## అసత్య ప్రచారాలను ఉపేక్షించం



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ

చింతలపూడి: యుద్ధ సంబంధిత అంశాలపై అసత్య ప్రచారాలను సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా చింతలపూడి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించారు. ఆపరేషన్ సిందూర్‌ను పురస్కరించుకుని అన్ని ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని, కొత్త వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. డ్రోన్ కెమెరాల పర్యవేక్షణ ద్వారా నేరాల గుర్తించి, ట్రాఫిక్ సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. హైస్కూల్, కాలేజీలు, రద్దీ ప్రదేశాల్లో శక్తి యాప్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి పౌరుడు భాగస్వామిగా ఉండాలని, దేశ సమగ్రతకు భంగం కలిగించే మత విద్వేషాలు, అసత్య ప్రచారాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. హెల్మెట్ ధరించడం బాధ్యత అని అన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులను గుర్తిస్తే వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ సీహెచ్ రాజశేఖర్, ఎస్సై కుటుంబరావు, సిబ్బంది పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### విపత్తులను సమర్థంగా ఎదుర్కోవాలి

కలెక్టర్ నాగరాణి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు విపత్తుల నిర్వహణపై అవగాహన శిక్షణా తరగతులను గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విపత్తుల కారణంగా జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలన్నారు. వరదలు, తుపానులు, ఉరుములు, మెరుపులు కారణంగా ఏ ఒక్క ప్రాణిని కోల్పోకూడదన్నారు. పిడుగుపాటుతో ఎవరైనా చనిపోతే ఆ కేసును ఆడిట్ చేయాలని ఆదేశించారన్నారు. ప్రతిఒక్కరూ ప్రజలను అప్రమత్తం చేయడంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, డీపీఓ బి.అరుణశ్రీ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు, కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

### డీఎస్సీకి ఉచిత శిక్షణ

భీమవరం: జిల్లాలోని బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు బీసీ సంక్షేమ సాధికారత అధికారి జీవీఆర్‌కేఎస్ఎస్ గణపతిరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు భీమవరం కలెక్టరేట్‌లోని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. బీఈడీ, డీఈడీ, ఏపీ టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. విద్యార్హత, ఆదాయ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని సూచించారు.

### పంచాయతీ ఆస్తుల రక్షణకు చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఆస్తుల రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఆస్తుల రక్షణకు ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి హై పవర్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మూడు వర్గాలుగా పంచాయతీ ఆస్తులను వర్గీకరించారని, ఆస్తుల రక్షణకు ప్రతి మూడు నెలలకు ఓసారి సమావేశమై ఆక్రమణల గుర్తింపు, తొలగింపు పురోగతిని సమీక్షించడానికి హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాస్థాయి హై పవర్ కమిటీని ఏర్పాటు చేశారన్నారు.

### రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

భీమవరం: జిల్లాలో కొత్త రేషన్ కార్డుల జారీకి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి ఎన్.సరోజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రస్తుత రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించారన్నారు.

### సబ్సిడీపై పశు దాణా




పెనుగొండ: 'పశుగ్రాసానికి గడ్డు కాలం' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి పశు సంవర్ధకశాఖ అధికారులు స్పందించారు. పాడి రైతులకు సబ్సిడీపై దాణా పంపిణీ చేయనున్నట్లు ఆ శాఖ డివిజనల్ డెప్యూటీ డైరెక్టర్ ఎల్‌కే సుధాకర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. త్వరలో సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను కూడా అందిస్తామని, దీని ద్వారా పశుగ్రాస కొరతను అధిగమించవచ్చని పేర్కొన్నారు.

# కదం తొక్కిన కలం

- సాక్షి ఎడిటర్ ఇంటిపై దాడులు దారుణం
- జర్నలిస్టు సంఘాల నిరసనలు



నూజివీడు : సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

నూజివీడు: 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి నివాసంలోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించడం పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడమేనని నూజివీడు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మద్దిరాల వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి, ఏఓ ఎం.ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మద్దిరాల మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలవడం ప్రజాస్వామ్యంలో పత్రికల హక్కని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తుందన్న అక్కసుతో ప్రభుత్వం పోలీసులతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరూ ప్రశ్నించరాదనే నిరంకుశ ధోరణి ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. ప్రెస్‌క్లబ్ సెక్రటరీ రుద్రపాటి మాణిక్యాలరావు మాట్లాడుతూ పత్రికలు తప్పనిసరిగా ప్రతిపక్ష పాత్రనే పోషిస్తాయని, పత్రికా స్వేచ్ఛను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అన్నారు. 'సాక్షి' ఆర్‌సీ ఇన్‌చార్జి ఉమ్మా రవీంద్రరెడ్డి, విలేకరులు ఎ.నాగరాజు, వరికూటి వెంకటకుమార్, కొమ్ము అర్జునరావు, జర్నలిస్టు సంఘాల నాయకులు అక్కినేని ప్రసాద్, ఆలీ అబ్బాస్, అలెన్, రుద్రపాటి ప్రసాద్, రవి, సుధీర్, మహేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

**బుట్టాయగూడెంలో..**



బుట్టాయగూడెం : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం తహసీల్దార్ కార్యాలయం వద్ద పాత్రికేయులు నిరసన తెలిపి తహసీల్దార్ పీవీ చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. రోజురోజుకూ విలేకరులపై దాడులు పెరుగుతున్నాయని, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించవద్దని కోరారు.

**పాలకొల్లులో..**



పాలకొల్లు : తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న ప్రెస్ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి సీనియర్ అసిస్టెంట్ వి.అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులను వేధింపులు, బెదిరింపులతో కట్టడి చేయాలనుకోవడం ప్రజాస్వామ్యం గొంతు నొక్కడమే అని అన్నారు.

## 'సాక్షి'పై దాడులు అమానుషం



డేగ ప్రభాకరరావు

ఏలూరు (టూటౌన్): ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా ఉన్న మీడియాపై దాడులకు దిగడం అమానుషమని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి డేగ ప్రభాకరరావు అన్నారు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడులు పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమే అని అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వాలు–ప్రజలకు మధ్య వారధిగా ఉండే మీడియా, దాని ప్రతినిధులపై కక్ష పూరితమైన చర్యలకు దిగడం తగదన్నారు. తమకు వ్యతిరేకంగా వార్తలు రాశారనో, అవినీతిని బయట పెడుతున్నారనో అక్కసుతో సోదాల పేరుతో పత్రికా ప్రధాన సంపాదకుడి ఇంటిపై దాడులకు తెగబడటం అత్యంత హేయమైన చర్య అని అభివర్ణించారు. ఇటువంటి చర్యలకు దిగిన పోలీసులను నియంత్రించాల్సిన కూటమి ప్రభుత్వం వారిని ఉసిగొల్పేలా వంత పాడటం సరికాదన్నారు.

**మూల్యం చెల్లించుకోక తప్పదు**

మీడియా సంస్థలు, వాటి ప్రతినిధులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తే కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ప్రభాకర్ మండిపడ్డారు. రాజ్యాంగబద్ధ హక్కులను కాలరాయడం తగదని, ఇందుకు బాధ్యులైన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏదైన పొరపాటు జరిగితే న్యాయబద్ధంగా వ్యవహరించాలే తప్ప దౌర్జన్యకర చర్యలకు దిగడం ఎంతమాత్రం సరికాదన్నారు. ఇది జర్నలిజానికే మాయని మచ్చ అని, ఇలాంటి సంఘటనలు మున్నెన్నడూ చూడలేదన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడిగానే భావించాల్సి ఉంటుందని, మేధావులు, వివిధ సంఘాల నాయకులు, పార్టీలు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. పాలకులు పోలీసు వ్యవస్థను చేతిలోకి తీసుకుని తమకు నచ్చని వారిపై సోదాలు, కేసుల పేరుతో వేధింపులకు దిగడం సరైన చర్య కాదని, రాష్ట్రంలోని ప్రజలంతా కూటమి ప్రభుత్వ చర్యలను గమనిస్తున్నారని, సరైన సమయంలో గుణపాఠం చెబుతారని ప్రభాకర్ అన్నారు.

# ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడే

## 'సాక్షి' ఎడిటర్ ఇంటిపై దాడిని ఖండించిన ప్రజాసంఘాలు

'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడి, తనిఖీల పేరిట భయభ్రాంతులకు గురి చేయడం ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై దాడే అని ప్రజాసంఘాల నాయకులు ఎలుగెత్తారు. ప్రభుత్వం అవలంబిస్తున్న అవినీతి విధానాలను ప్రజలకు వార్తల ద్వారా తెలియజేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్న పాలకులు ఇటువంటి చర్యలకు పాల్పడటం అవివేకమన్నారు. ప్రభుత్వ తీరు మారకుంటే ప్రజా వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

– ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/ తాడేపల్లిగూడెం (టీఓసీ)

### ఇబ్బందులు పెట్టడం సరికాదు



పత్రికలు ప్రభుత్వాలు అనుసరించే లోపభూయిష్ట విధానాలపై కథనాలు ఇవ్వడం పరిపాటి. వాటిని దృష్టిలో పెట్టుకుని లోపాలను సరి చేసుకుని సుపరిపాలన అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. అంతేకాని లోపాలు, అవినీతిపై కథనాలు రాసిన వారిని ఇబ్బందులు పెట్టడం సరికాదు. ఇటువంటి చర్యలతో ప్రభుత్వం ప్రజాదరణకు దూరమవుతుంది.

– కోలా భాస్కరరావు, వివేకానంద ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు

### తీవ్రంగా ఖండిస్తున్నాం



సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంపై దాడులను ఏపీయూడబ్ల్యూజే తీవ్రంగా ఖండిస్తోంది. పత్రికా రంగంపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయనే నెపంతో పత్రికలు, పాత్రికేయులపై వేధింపులు, అక్రమ కేసులకు పాల్పడితే సహించం. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి. దాడులు వెంటనే ఆపాలి.

– వాసా సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్

### పత్రికా స్వేచ్ఛకు విఘాతం



పత్రికా విలేకరులు, ఎడిటర్లపై ప్రభుత్వమే దాడులు చేస్తూ, కక్ష సాధింపులకు పాల్పడుతూ సమాజానికి ఏం మెసేజ్ ఇవ్వాలనుకుంటున్నారు. ఇటువంటి చర్యల ద్వారా సాధారణ పౌరులు కూడా ప్రతి దాడులకు తెగించవచ్చనే మెసేజ్ వెళుతుంది. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే ఇటువంటి చర్యలు మంచిది కాదు.

–చిక్కా భీమేశ్వరరావు, సీనియర్ న్యాయవాది

### కక్ష సాధింపు తగదు



సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లోకి పోలీసులు చొరబడటం, తొలుతగా ఎటువంటి నోటీసులివ్వకుండా ఇంట్లో సోదాలు నిర్వహించడం కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలుగా భావించాలి. వీటిని తాము ఖండిస్తున్నాం. పోలీసులు చట్టపరంగా వ్యవహరించకుండా ప్రభుత్వాలకు కొమ్ము కాస్తున్నాయి.

– మెరిపో జాన్ రాజు, కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు

### ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు



పత్రికలపై దాడులు అమానుషం, ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు. పత్రికలపై పోలీసులే దాడులకు దిగడం దుర్మార్గ చర్య. దీనికి బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారనే అక్కసుతో రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ దాడులకు దిగడం తగదు.

– మెండెం సంతోష్‌కుమార్, ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

### అందరూ ఖండించాలి



ప్రభుత్వ లోపాలను ప్రశ్నించే వారిని ఇలా ఇబ్బంది పెట్టడం సరికాదు. చట్టప్రకారం, ప్రజాస్వామ్య పద్ధతిలో పోలీస్ అధికారులు వ్యవహరించాలి. కక్ష సాధింపు చర్యలను ప్రభుత్వం వీడాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదు. ప్రభుత్వ దుశ్చర్యలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కోరుతున్నాం.

– గెడ్డం రవీంద్రబాబు, కుల నిర్మూలన పోరాట సమితి ప్రధాన కార్యదర్శి

# ప్రభుత్వ అసంబద్ధ విధానాలపై గళం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

భీమవరం: పాఠశాల విద్యారంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జి.ప్రకాశం మాట్లాడుతూ 1 నుంచి 5వ తరగతి వరకు ప్రతి ప్రాథమిక పాఠశాలను బేసిక్ ప్రాథమిక పాఠశాల లేదా మోడల్ ప్రాథమిక పాఠశాలగా కొనసాగించాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో మరిన్ని స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలకు 6 నుంచి 10వ తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్లతో పాటు ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బీవీ నారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బకాయి ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర భృతి కింద 30 శాతం ఇవ్వాలన్నారు. ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ నాగరాణికి అందజేశారు. ధర్నాలో గౌరవాధ్యక్షుడు పీఎస్‌వీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు లంక రాజు, కండిబోయిన రాంబాబు, పోతురాజు, దేవదాసు కార్యదర్శులు పి.జనార్దనస్వామి, వి.రామ్మోహన్, పీవీ రాఘవులు పాల్గొన్నారు.

# కుట్టుమెషీన్ల పేరుతో కూటమి దోపిడీ

**మాజీ మంత్రి కారుమూరి**




తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి కారుమూరి, పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్ : కూటమి ప్రభుత్వం ప్రజలకు స్కీమ్‌లు అందించడం మానేసి రకరకాల స్కామ్‌ల పేరుతో ప్రజాధనాన్ని దోచుకుంటోందని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు విమర్శించారు. బీసీ వర్గాలకు కుట్టుమెషీన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం భారీ స్కామ్‌కు తెర తీసిందని దుయ్యబట్టారు. శుక్రవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుట్టుమెషీన్ల కొనుగోళ్లు, శిక్షణకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల్లో భారీ వ్యత్యాసం ఉందని, ఇది రూ.150 కోట్లకుపైగా స్కామ్‌గా తెలుస్తుందన్నారు. ఒక్కో లబ్ధిదారుకు మెషీన్ కొనుగోలు, శిక్షణకు సంబంధించి రూ.23 వేల చొప్పున కేటాయించడం దోపిడీకి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమాన్ని వదిలేసి దోచుకో దాచుకో అనే రీతిలో చంద్రబాబు ప్రభుత్వం ఉందన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి సీఎం జగన్ విద్యుత్ యూనిట్‌ను రూ.2.49లకు కొనుగోలు చేస్తే నేడు చంద్రబాబు రూ.4.60 కొనుగోలు చేయడం కూడా అతి పెద్ద కుంభకోణమని మండిపడ్డారు. అమరావతిలో కూడా ఇదే తరహాలో నిర్మాణ పనుల్లో కోట్లాది రూపాయలు దోపిడీకి దిగారని విమర్శించారు. అందినకాడికి ప్రజాధనాన్ని దోచుకుని సంపద సృష్టించుకునే పనిలో చంద్రబాబు ప్రభుత్వం పనిచేస్తుందని దుయ్యబట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి కుట్టుమెషీన్ల స్కామ్‌పై సీబీఐతో విచారణ చేయించాలని వినతి పత్రాన్ని అందజేశారు. ముందుగా సజ్జాపురంలోని పార్టీ కార్యాలయం నుంచి మోటారు సైకిళ్లపై ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, ఎంపీపీ రుద్రా ధనరాజు, లీగల్ సెల్ సభ్యులు వెలగల సాయిబాబారెడ్డి, పెన్మెత్స సుబ్బరాజు, పాట్ల సురేష్, జల్లూరి జగదీష్, మెహర్ అన్సారీ, కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, నూకల కనకదుర్గ, ఉండవల్లి జానకి, జంగం ఆనంద్‌కుమార్, పెనుమాక రాజేష్, గెద్దాడ శ్రీకాంత్, వడ్డి మార్కండేయులు, పుల్లెపు సూర్యచంద్రరావు, రంభ నాగేశ్వరరావు, బిరుదుకోట చింతన్న, చింతాడ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నాటుసారా స్థావరంపై దాడి



కామయ్యపాలెం సమీపంలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెం సమీపంలో శుక్రవారం నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడి చేశారు. దాడిలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. 5 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని శ్రీనివాసరావుపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### ట్రిపుల్ ఐటీలో ముగిసిన వర్క్‌షాప్



వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య అమరేంద్రకుమార్

నూజివీడు: ఆర్జీయూకేటీ, వాద్వానీ ఫౌండేషన్ సంయుక్తంగా నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఐదు రోజుల పాటు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఎడ్యుకేషన్‌పై నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థుల్లో వ్యవస్థాపక నైపుణ్యాలు వెలికితీసి, సృజనాత్మక ఆలోచనలతో ముందుకెళ్లేలా ప్రోత్సహించడమే శిక్షణా కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అధ్యాపకులు శిక్షణలో నేర్చుకున్న అంశాలకనుగుణంగా తరగతి గదిలో విద్యార్థులకు బోధించి స్టార్టప్‌లు ప్రోత్సహించాలన్నారు. రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీలను స్టార్టప్‌లకు కేంద్రంగా మార్చాలన్నారు. ఈఈఐటీపీ డీన్ పీ శ్యామ్, యూనివర్సిటీ డీన్ శ్రావణి, ఆర్జీయూకేటీ సీఏఓ బండి ప్రసాద్, ఏఓ బీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

# సూర్య, చంద్ర ప్రభలపై మెరిసిన శ్రీవారు

- శ్రీరామ అలంకారంలో దర్శనం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ద్వారకాతిరుమల: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆ దేవదేవుడు సూర్య, చంద్ర ప్రభలపై మెరవగా.. కనులారా వీక్షించిన భక్తజనులు పులకించారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో జరుగుతున్న వైశాఖ మాస దివ్య బ్రహ్మోత్సవాల్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా పంచాయుధాలను ధరించి, నారాయణమూర్తి అలంకరణలో సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించిన శ్రీవారికి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి హారతులిచ్చారు. ఆ తరువాత గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వాహనంపై ఉన్న స్వామివారిని దర్శించిన భక్తులకు సూర్యదేవుడి అనుగ్రహంతో సకల విద్యా, ఆరోగ్య, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పండితులు చెబుతున్నారు. రాత్రి ఉభయ దేవేరులతో శ్రీవారు చంద్రప్రభ వాహనంపై క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. మేళతాళాలు, మంగళ వాద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చరణలు, గజ, అశ్వ సేవలు, చిరుగాలుల నడుమ చల్లనయ్య విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీహరి కళాతోరణ వేదికపై ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఆలయ ముఖ మండపంలో శ్రీరామ అలంకారణలో దర్శనమిచ్చిన శ్రీవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు.



సూర్యప్రభ వాహనంపై కొలువైన స్వామి, అమ్మవార్లు



శ్రీరామ అలంకారంలో దర్శనమిస్తున్న శ్రీవారు



చంద్రప్రభ వాహనంపై స్వామి, అమ్మవార్లు



చిన్ని కృష్ణుడితో నృత్య ప్రదర్శనలు

### బ్రహ్మోత్సవాల్లో నేడు..

ఉదయం 7 గంటల నుంచి – హనుమద్వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ, భజన కార్యక్రమాలు

- 8 గంటల నుంచి – భక్తిరంజని
- 9 గంటల నుంచి – కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- సాయంత్రం 4 గంటల నుంచి – నాదస్వర కచేరి
- 5 గంటల నుండి – కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- 6 గంటల నుంచి – ప్రవచనాలు
- రాత్రి 7 గంటల నుంచి – ఎదుర్కోలు ఉత్సవం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు
- 8.30 గంటల నుంచి – వెండి శేషవాహనంపై తిరువీధి సేవ
- 9 గంటల నుంచి – మోహినీ భస్మాసుర నాటకం
- శ్రీవారి ప్రత్యేక అలంకారం : మురళీకృష్ణ

### పట్టు వస్త్రాలు సమర్పించిన టీటీడీ

ద్వారకాతిరుమల: శ్రీవారికి, అమ్మవార్లకు తిరుమల తిరుపతి దేవస్థానం శుక్రవారం పట్టు వస్త్రాలు సమర్పించింది. ఉదయం అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ టీటీడీ అధికారి పట్టువస్త్రాలను శిరస్సుపై పెట్టుకుని ఆలయంలో ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం శ్రీవారి దేవస్థానం ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి చేతుల మీదుగా అర్చకులకు అందజేశారు.



పట్టు వస్త్రాలతో ఆలయంలో ప్రదక్షిణలు చేస్తున్న టీటీడీ అధికారి

### వైద్య విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించాలి



ఏలూరు జీజీహెచ్‌లో మెడికల్ కాలేజీ భవనాలు పరిశీలిస్తున్న స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు టౌన్: ఏలూరులోని ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులకు వసతి గృహాలు నిర్మించాలని వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో, ఆయుష్మాన్ భారత్ విభాగం వద్ద, సాంఘిక సంక్షేమ వసతి గృహాల సముదాయాల వద్ద ప్రభుత్వ వైద్య కళాశాల భవనాల నిర్మాణ పనులను శుక్రవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి, రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు డాక్టర్ నరసింహం, సహాయ సంచాలకుడు వెంకటేష్, ఎమ్మెల్యే బడేటి చంటి, వివిధ శాఖల అధికారులతో కలిసి కృష్ణబాబు పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ రానున్న రోజుల్లో వైద్య కళాశాలలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, వివిధ వైద్య విభాగాలలో స్పెషలిస్ట్ కోర్సులు 750 మంది పైగా అభ్యసిస్తారని, ఆ సామర్థ్యానికి తగినట్లు ప్రస్తుతం ఉన్న భవనాలకు అదనంగా హాస్టల్ భవనాలు నిర్మించేందుకు ప్రతిపాదనలు వెంటనే పంపాలన్నారు. వసతి గృహ భవనాలు వైద్య కళాశాలకు దగ్గరలో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్ నిర్మాణానికి అందుబాటులో ఉన్న స్థలం వివరాలు స్పెషల్ సీఎస్‌కు వివరించారు. ఏలూరులోని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆవరణలో నిర్మిస్తున్న వైద్య కళాశాల నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ మాలిని, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, ఏపీఎంఎస్ఐడీసీ కార్పొరేషన్ ఈఈ ముక్కంటి, వైద్యారోగ్య శాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు, పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల కింద పనిచేస్తున్న ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు తీసుకొని వాటిని సరిచేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలు పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో, నోటీసు బోర్డుల్లో శుక్రవారం నుంచి అందుబాటులో ఉన్నాయన్నారు. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10 నుంచి 12వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సరైన ఆధారాలతో విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

### సమ్మె విజయవంతం చేయాలి

ఏలూరు (టూటౌన్): కేంద్రం కార్మిక హక్కులను హరించి వేస్తోందని ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, కో కన్వీనర్ వెంకట కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మే 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెకు సంఘీభావంగా చేతి వృత్తిదారులు పాల్గొనాలని వారు కోరారు.

## మనిషి మనిషిగా ఉంటే శత్రువులు ఉండరు

ద్వారకాతిరుమల: మనిషి మనిషిగా ఉంటే అతడికి శత్రువులు ఉండరని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి అన్నారు. ద్వారకాతిరుమల విర్డ్ ఆస్పత్రిని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. ముందుగా ఆస్పత్రికి విచ్చేసిన చిన్న జీయర్ స్వామికి శ్రీవారి దేవస్థానం ఈఓ, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ఆస్పత్రి ట్రస్టీ ఐవీఆర్ సుధాకర్, వి.నారాయణమూర్తి, డాక్టర్ భవ్యచంద్‌లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రి ఆవరణలో కొలువైన చినవెంకన్న విగ్రహానికి హారతులిచ్చారు. అనంతరం ఆస్పత్రిని పరిశీలించి, రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఆ తరువాత ఆస్పత్రి ఆవరణలో భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు.



విర్డ్ ఆస్పత్రిలో శ్రీవారి విగ్రహానికి హారతులిస్తున్న చినజీయర్ స్వామి

#### వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సమస్త సృష్టిని నడిపించే చైతన్య స్వరూపమే భగవత్ తత్వమని చినజీయర్ స్వామిజీ అన్నారు. ఏలూరు ఆర్‌ఆర్ పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న సుదర్శన కలశ ప్రతిష్ఠోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని క్రతువును ముందుకు నడిపించారు. దేవస్థానంలో 36వ వార్షిక నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్ఠోత్సవం, మహాకుంభాభిషేక మహోత్సవం ఈ నెల 3 నుంచి కొనసాగుతున్నాయి. శుక్రవారం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చతుఃస్థానార్చన తదితర వైదిక క్రతువులను నిర్వహించారు. చినజీయర్ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నేటి నుంచి మీసాల వెంకన్న బ్రహ్మోత్సవాలు

- 11న స్వామివారి కల్యాణం
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవదాయ శాఖ

కైకలూరు: కైకలూరులో శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామికి బొడ్డులో కత్తి, ముఖంపై మొనతేలిన మీసాలు ఉండటం ఓ వింత. అందుకే స్వామిని మీసాల వెంకన్నగా పిలుస్తారు. పౌరుషానికి ప్రతీకగా వెలిసిన స్వామివారి దేవాలయం అత్యంత పురాతనమైనది. ఈ నెల 10 నుంచి 12 వరకు స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. త్రయోహ్నిక దీక్షతో వైఖానస ఆగమోక్తం పద్ధతిలో స్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. శ్రీనివాసుల లక్ష్మీ ప్రవీణ్, బృందావనం లక్ష్మీ నృసింహచార్యులు, అగ్నిహోత్రం మిధునాచార్యులు, బృందావనం గోపీ కృష్ణమాచార్యులు బ్రహ్మోత్సవాల క్రతువును చేపడతారు. ఈ నెల 10న స్వామి, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేస్తారు. మాడ వీధుల్లో గజవాహనంపై స్వామి ఊరేగింపు జరుగుతుంది. 11న మాడ వీధుల్లో శేష వాహనంపై ఊరేగింపు, రాత్రి 7 గంటలకు భూ సమేత శ్రీ వేంకటేశ్వరుని దివ్య కల్యాణం, 12న స్వామివారి గ్రామోత్సవం జరగనుంది. బ్రహ్మోత్సవాలు మూడు రోజులు కై కలూరు శ్రీమన్నారాయణ గోష్టి సీహెచ్.హేమలత బృందంతో విష్ణు సహస్ర నామ పారాయణం జరుగుతుంది.



కైకలూరులో మీసాల వెంకన్న స్వామి

### అన్ని ఏర్పాట్లూ పూర్తి



బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇటీవల దేవాలయాన్ని సుందరంగా పునఃనిర్మించారు. బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలుగా కూచిపూడి, భరతనాట్యం, కోలాట ప్రదర్శన ఏర్పాటు చేశాం.

–వీఎన్‌కే.శేఖర్, దేవస్థానం ఈవో

### ● హైటెన్షన్‌పై హోర్డింగ్



తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి హౌసింగ్ బోర్డుకు వెళ్లే కేఎన్ రోడ్డులో హోర్డింగ్ విరిగి హై టెన్షన్ విద్యుత్ వైర్లపై పడి ప్రమాదకరంగా మారింది. దీంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో మంటలు ఎగసిపడడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. హై టెన్షన్ విద్యుత్ వైర్లు, స్తంభాలున్న చోట్ల హోర్డింగ్‌లు ప్రమాదకరమని చెప్పినా పట్టించుకోవడం లేదు. చివరకు విద్యుత్ సిబ్బంది హోర్డింగ్ తొలగించారు. విద్యుత్ లైన్లు ఉన్న చోట్ల హోర్డింగ్‌లు ఏర్పాటు చేయకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

–తాడేపల్లిగూడెం(టీఓసీ)

### పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

భీమవరం: భీమవరం రెండో పట్టణానికి చెందిన విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన బాబూరావు(64)ను శుక్రవారం ఆరెస్టు చేశామని సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. ఆడుకుంటున్న బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు విషయం చెబితే చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

### తప్పిపోయిన బాలుడు

ద్వారకాతిరుమల: స్థానిక యూనియన్ బ్యాంక్ సమీపంలో ఒంటరిగా తిరుగుతున్న బాలుడిని స్థానికులు శుక్రవారం పోలీసులకు అప్పగించారు. 5 ఏళ్ల వయసున్న ఈ బాలుడు తన పేరు గోపాల్ అని, తండ్రి పేరు నాయక్ అని చెబుతున్నాడని, అంతకు మించి వివరాలు చెప్పలేకపోతున్నాడని ఎస్సై టి.సుధీర్ తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిస్తే 94407 96653 నెంబర్‌కు కాల్‌చేసి సమాచారం అందించాలని కోరారు.



పోలీసుల సంరక్షణలో ఉన్న బాలుడు

## క్లుప్తంగా

### దుర్గమ్మ ఆలయంలో అన్నదానం


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

పెంటపాడు: విశ్వావసునామ సంవత్సర వైశాఖమాసం రెండో శుక్రవారం పురస్కరించుకొని ప్రత్తిపాడు కాగులంపాడు రోడ్డులో వేంచేసియున్న స్వయంభువుగా వెలిసిన కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం కాగులంపాడుకు చెందిన నున్నా రామకోటి, సుజాత, దంపతుల ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సాతులూరి పవన్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు బడేటి ఉదయభాను, గ్రామస్తులు, దాతలు పాల్గొన్నారు.

### రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న దాతలు

తణుకు అర్బన్ : రక్తదానం ప్రాణాన్ని నిలబెడుతుందని, రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అసిస్టెంట్ లేబరు ఆఫీసర్ బి.లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా తణుకు రెడ్‌క్రాస్ సంస్థలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం దానం చేస్తే ఆ ప్రాణాన్ని నిలబెట్టినవారిగా ఉంటారన్నారు. ఈ రక్తదాన శిబిరంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు, పలు వ్యాపార సంస్థలు, భవన నిర్మాణ కార్మికులు స్వచ్ఛందంగా రక్తాన్ని ఇచ్చి మానవత్వాన్ని చాటుకున్నారని స్పష్టం చేశారు. అనంతరం రక్తదానం చేసినవారికి రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా సర్టిఫికెట్లు అందజేసినట్లు చెప్పారు.

### వీధుల్లో పందుల సంచారంపై నిషేధం


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్


తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పురపాలక సంఘం పరిధిలో 1 నుంచి 35 వార్డుల్లో పందుల పెంపకదారులతో శుక్రవారం కమిషనర్ ఏసుబాబు చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వీధుల్లో పందులు విచ్చలవిడిగా తిరగడం నిషేధమని తెలిపారు. పందులు ఊరికి 5 కిలోమీటర్లు దూరంగా తరలించి, పెంచాలని తెలిపారు. అదే విధంగా వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు పందుల పెంపకందారుల సర్వేను సక్రమంగా నిర్వహించాలని, ఈ సర్వేకు పందుల పెంపకందారులు సహకరించాలని కోరారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పట్టణ ఎరుకుల సేన సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రకృతి విపత్తుల నిర్వహణపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

తాడేపల్లిగూడెం రూరల్: మండల పరిషత్ కార్యాలయం, మండల మహిళా సమాఖ్య భవనంలోనూ శుక్రవారం ప్రకృతి విపత్తుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాలుగు బ్యాచ్‌లుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, సెక్రటరీలు రవిచంద్ర, శ్రీనివాస చంద్రరాజు, ఫణి, బాలకృష్ణ పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడిగా వడ్డే



ఇరగవరం: మండలంలోని రేలంగి గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా వడ్డే మార్కండేయులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు తెలిపారు. గ్రామంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన మార్కండేయులు అందరితో కలిసిపోయే వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి, ఎంతో రాజకీయ అనుభవం కలిగి పార్టీకి ఎన్నో సేవలు అందిస్తున్నారు. గతంలో గ్రామ ఉప సర్పంచ్‌గా సేవలు అందించారు. అనుభవం, కష్టపడే తత్వం ఉన్న మార్కండేయులును పార్టీ గ్రామ అధ్యక్షుడిగా ఎన్నుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చికెన్ ఫాక్స్‌పై అప్రమత్తత అవసరం

- గ్రామాల్లో కనిపిస్తున్న ఆటలమ్మ, గవద బిళ్లల కేసులు
- చిన్నారుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు


చికెన్ ఫాక్స్ సోకిన చిన్నారి

పెంటపాడు: వేసవికాలం ప్రారంభమైందంటే చాలు. చికెన్ ఫాక్స్ (ఆటలమ్మ), గవద బిళ్లల సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తుంది. ప్రధానంగా ఎండలు మండుతున్నాయి. వాతావరణ పరిస్థితులు వేడెక్కాయి. మరో వైపు ఇప్పటికే గ్రామాల్లో చికెన్ ఫాక్స్, గవద బిళ్లల సమస్య కనిపిస్తుంది. వీటి బారిన పడిన వారికి జలుబు, దగ్గు, జ్వరం, శరీరంపై పొక్కులు దవడలకు ఇరు వైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తున్నాయి. అన్ని వయసుల వారికి ఈ అంటు వ్యాధులు సోకే అవకాశం ఉంది. ప్రధానంగా చిన్నారులకు ఎక్కువగా సోకే అవకాశం ఉంది. దీని వలన ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్తలు మేలని అంటూ వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పట్టణ, పల్లెల్లో పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి సోకుతుంది. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్న వారిలో ఈ సమస్యలు అధికంగా కనిపిస్తుంది. ఆటలమ్మ, గవద బిళ్లలు సోకిన వారు తీవ్ర అసౌకర్యానికి లోనవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నీరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచన మేరకు యంటీవైరల్, యాంటీ బయాటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

ఆటలమ్మ సోకిన వారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు ఇవ్వడం మంచిది. గవదబిళ్లలు వచ్చిన వారికి గొంతు నొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలు ఆహారంగా తీసుకోవాలి. చికెన్ ఫాక్స్, గవద బిళ్లలు వచ్చిన వారి విషయంలో మూఢ నమ్మకాలు విడనాడాలి. నాటువైద్యం కాకుండా సరైన వైద్యుని ద్వారా మందులు వాడాలి. నాటు వైద్యం తగదని వైద్యులు సూచిస్తున్నారు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ఊపిరితిత్తులు, మెదడుపై ప్రభావం పడుతుందని వైద్యులు సూచిస్తున్నారు. ఇలాంటి వ్యాధులు సోక కుండా గోరు వెచ్చని నీటిని చిన్నారులకు ఇవ్వాలని, పరిశుభ్రమైన ఆహారం అందించడంతోపాటు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చెబుతున్నారు.

### వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవదబిళ్లలు సోకిన సందర్భంలో నిర్లక్ష్యం వహించకుండా వైద్యులను సంప్రదించాలి. ప్రధానంగా శుభ్రత అవసరం. వైద్యుల సూచనల మేరకు తప్పక మందులు వాడాలి. ఈ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదు.

– తోట రాజేష్, వైద్యాధికారి, పెంటపాడు

# సైనికుడు మురళీ నాయక్‌కు ఘన నివాళి


మురళీ నాయక్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు అర్బన్: ఆపరేషన్ సింధూర్ నినాదంతో పాకిస్తాన్‌తో భారతదేశం చేస్తున్న యుద్ధంలో వీర మరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన జవాన్ మురళీ నాయక్‌కు మాజీమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నివాళులర్పించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జవాన్ మురళీ నాయక్ చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ సత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలానికి చెందిన మురళీనాయక్ మృతి భారతీయులను తీవ్రంగా కలచివేసిందన్నారు. జమ్మూ కాశ్మీర్‌లోని యుద్ధభూమిలో అసువులుబాసిన వీరజవాన్ కుటుంబ సభ్యులకు భారతీయులు అండగా నిలబడాలని సూచించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మారిశెట్టి శేషగిరి, వైఎస్సార్‌సీపీ పంచాయితీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి సీతారాం, లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి, పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్ల సురేష్, జంగం ఆనంద్‌కుమార్, చోడే గోపికృష్ణ, తోట సురేంద్ర, చింతలపూడి సూర్యనారాయణ, పుల్లెపు సూర్యచంద్రరావు, షేక్ బాజీ, వై.రామకృష్ణ, రేలంగి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

**ఇండియన్ ఆర్మీ కృషి అభినందనీయం**

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఇండియన్ ఆర్మీకి ప్రజలు అండగా ఉండాలని, పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిని సమర్థవంతంగా ఎదుర్కొని ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. సత్యసాయి జిల్లాకు చెందిన మురళీ నాయక్ వీర మరణాన్ని భారత జాతి ఎన్నడూ మరచిపోదని, ఆపరేషన్ సిందూర్‌లో శత్రు మూకలతో పోరాడి జమ్ము కాశ్మీర్ సరిహద్దుల్లో వీర మరణం పొందిన మురళీ నాయక్ త్యాగం భారతదేశానికి గర్వకారణమన్నారు.

# 20న సమ్మె విజయవంతం చేయాలి


లేబర్ కోడ్స్‌పై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు

తణుకు అర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్లను రద్దు చేయమని ఈ నెల 20న నిర్వహించే సమ్మెలో కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, ఏఐటీయూసీ నాయకులు బొద్దాని నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం సీఐటీయూ మండల కార్యదర్శి గుబ్బల గోపి అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మెలో ఉద్యోగ, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పాత కార్మిక చట్టాలు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలు విడనాడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అడ్డగర్ల అజయకుమారి, మందుల ముత్తయ్య, పీఎల్ నరసింహారావు, శ్రీనివాసరాజు, గార రంగారావు, కొంబొత్తుల రవి, ఏ. వెంకటేశ్వరావు, ఆరుగోలు రమేష్, పి.దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు మిషన్ల కుంభకోణంపై విచారణ జరపాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఇరగవరం: తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అత్తిలి: బీసీ మహిళల కుట్టుమిషన్ల పంపిణీ, శిక్షణ కు సంబంధించి అవకతవకలకు పాల్పడిన అవి నీతి పరులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బుద్దరాతి భరణీప్రసాద్ అన్నారు. బీసీ మహిళల కుట్టు మిషన్ల పథకం అమలులో రాష్ట్రంలో జరిగిన భారీ కుంభకోణంపై అవినీతి పరులపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ దశిక వంశీకి వైఎస్సార్‌సీపీ శ్రేణులు వినతిపత్రం అందజేశారు. భరణీప్రసాద్ మాట్లాడుతూ కుట్టుమిషన్ల పంపిణీ, శిక్షణ పథకం అమలు చేయడంలో జరిగిన తప్పులవలన దాదాపు రూ. 245 కోట్ల రూపాయలు చేతులు మారాయన్నారు. ఉప సర్పంచ్ మద్దాలశ్రీనివాస్,జెడ్పీ కో–ఆప్షన్ మెంబర్ మహ్మ ద్ అబీబుద్దీన్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు రంభ సూరిబాబు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సబ్బితిరాజేష్, అత్తిలి టౌన్ అధ్య క్షుడు పోలినాటి చంద్రరావు, చినవెంకన్న ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు కంకటాల సతీ ష్, వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్లపల్లి మణికుమార్, కాపల్లె వెంకటేశ్వరరావు, రాంపండు పాల్గొన్నారు.

**అవకతవకలు తేల్చాలి**

ఇరగవరం: బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీలో, ట్రైనింగ్‌లో జరిగిన అవకతవకలపై నిగ్గు తేల్చాలని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మట్లాడుతూ బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పంపీణీ, ట్రైనింగ్ పథకంలో సుమారు రూ. 245 కోట్లు మేర భారీ కుంభకోణం జరిగిందని మా పార్టీ ఆదేశాలతో వివరాలు మీ దృష్టికి తీసుకొస్తామన్నారు. వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, బీసీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ పథకంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గాప్రసాద్, మాజీ డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, చవ్వాకల శ్రీనివాస్, కుడిపూడి నాగ వెంకట సత్యనారాయణ, ఎంపీటీసీ పాల పాలేశ్వరరావు, వీరవల్లి విగ్నేష్, పంపన సూర్యనారాయణ, జక్కంశెట్టి ఏడుకొండలు, శీలబోయిన శ్రీను, పెచ్చేటి పెద స్వామి, కుక్కల శ్రీనివాస్, కాసాని రాముడు, తదితరులు పాల్గొన్నారు.

# పైళ్లమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభం


అమ్మవారి ఘటాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో ఏడేళ్లకోసారి జరిగే గ్రామ దేవత పైళ్లమ్మ ఉత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం అమ్మవారి పూరి గుడికి రాట ముహూర్తం చేశారు. శుక్రవారం అమ్మవారిని నడి వీధికి తీసుకొచ్చి గ్రామస్తుల దర్శనాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఘటాలకు ప్రత్యేక పూజలు చేసి 4 గ్రూపులుగా గ్రామోత్సవాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రీతిపాత్రమైన రోజు శుక్రవారం అమ్మవారిని దర్శించుకొనేందుకు ప్రతి ఇల్లు శుభ్రం చేసుకొని గ్రామస్తులు తోరణాలు కట్టారు.

**25 వరకు పైళ్లమ్మ ఉత్సవాలు**

కాగా ఈ నెల 8న ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు 25 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 11న రాత్రి అమ్మవారికి మొదటి సేవలో భాగంగా గరగల ఊరేగింపుతో ఆశాదుల నృత్యాలు, బుట్ట బొమ్మలు, నాసిక్ డోలు, కొర్ర గేదెలు, బుట్ట బొమ్మలతో డీజే కార్యక్రమాలు, 15న రాత్రి రెండో సేవ, 23న ప్రధాన కార్యక్రమమైన జాతర ఉత్సవం పురస్కరించుకొని కేరళ డ్రమ్, బెల్లీ నృత్యాలు, తీన్‌మార్ స్టార్‌బాయ్స్, కాళికా డాన్స్, హైదరాబాద్ పోతురాజు టీం నృత్యాలు, సాల్మన్, సినీ కోబ్రా, గారడీ నృత్యాలు, అదే రోజు భారీ బాణసంచా కాల్పులు, 24న అమ్మవారి బలిచేట 25న నైవేద్యాల సమర్పణ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ప్రజలు అమ్మవారిని దర్శించుకొని కార్యక్రమాలు వైభవంగా నిర్వహించేందుకు సహకరించాలన్నారు.


గ్రామ దేవత పైళ్లమ్మ

### సమ్మెను జయప్రదం చేద్దాం

తాడేపల్లిగూడెం (టీటీసీ): దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె ఈ నెల 20వ తేదీన నిర్వహిస్తున్నందున సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సీఐటీయూ అనుబంధం సర్వసభ్య సమావేశం శుక్రవారం చుక్కా అప్పలస్వామి భవనంలో నిర్వహించారు. కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని విమర్శించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, చిటికిన రాము, సత్యనారాయణ పాల్గొన్నారు.

### పుష్కర యాత్రా బస్సును సద్వినియోగం చేసుకోండి

తాడేపల్లిగూడెం (టీటీసీ): పవిత్ర సరస్వతీ నది పుష్కరాలు తెలంగాణలోని కాళేశ్వరంలో వైభవంగా ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పుష్కర స్నానాల నిమిత్తం ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్ కాళేశ్వరం సరస్వతి నది పుష్కర్ యాత్రా స్పెషల్ నడుపుతున్నామని ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ వై.సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ఈ నెల 15వ తేదీ గురువారం సాయంత్రం 7 గంటలకు పట్టణంలో బయలుదేరి వరంగల్ భద్రకాళీమాత సందర్శనం తదుపరి వేములవాడ శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దర్శనం, కొండగట్టు ఆంజనేయస్వామి సందర్శనం, అనంతరం ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ దర్శనం, మరుసటి రోజు ఉదయం కాళేశ్వరం చేరి మహాకాళేశ్వరుని దర్శనం, పవిత్ర పుష్కర స్నానం తదుపరి రామప్ప దేవాలయ దర్శనం చేయిస్తామని తెలిపారు. తిరిగి బస్సు 18వ తేదీ తెల్లవారు జామున తాడేపల్లిగూడెం చేరుతుందని వెల్లడించారు. టికెట్ చార్జీ ఒక్కొక్కరికీ రూ.2100 మాత్రమే అన్నారు. వసతి రూం అద్దెలు, ఆహారపు ఖర్చులు యాత్రికులు భరించాలని వివరించారు.

### బాల్య వివాహాలతో అనేక అనర్థాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో సరస్వతి

తాడేపల్లిగూడెం రూరల్: బాలికలకు 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ అధికారిణి టీఎల్ సరస్వతి అన్నారు. కిశోరి వికాసంలో భాగంగా శుక్రవారం పెదతాడేపల్లి రైతుసేవా కేంద్రంలో సమ్మర్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ యుక్త వయస్సు రాకుండా వివాహాలు చేయడం వలన గర్భస్థ దశపై అవగాహన ఉండదన్నారు. దీంతో శారీరక సమస్యలను ఎదుర్కొంటారన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్తేరు రాణి, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఎంఈవోలకు పదోన్నతులు కల్పించాలి

పెంటపాడు: బదిలీల ముందే ఎంఈవో–1, 2లకు ప్రభుత్వం తక్షణం పదోన్నతి కల్పించి, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎంఈవో–2ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు టీవీ రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రస్తుతం అనేకమంది ఎంఈవోలు పదవీ విరమణ చేయడం వలన ఆ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు. కొత్త విద్యా సంవత్సరంలో ఎంఈవోల ప్రాధాన్యత అధికంగా ఉంటుందన్నారు. విద్యార్థుల చేరిక పునర్‌వ్యవస్థీకరణ వంటి ఎన్నో అంశాలపై ఎంఈవోల పర్యవేక్షణ అవసరమన్నారు. కాగా ప్రభుత్వం పదోన్నతి విషయంలో సరైన అవగాహన లేకపోగా, వీటిని భర్తీ చేసే అవకాశం ఉండేలా లేదన్నారు. ఒక్కో మండలం నుంచి 5 మండలాలకు ఎంఈవోలు ఇన్‌చార్జిలుగా పని చేస్తున్నారన్నారు. ప్రస్తుతం విద్యా వ్యవస్థలో ఇద్దరు ఎంఈవోల అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు కూడా వీటిపై పోరాడాలన్నారు.

### పేదలకు దుప్పట్ల పంపిణీ

పెంటపాడు: తాడేపల్లిగూడెం టీచర్స్ కాలనీకి చెందిన ఉపాధ్యాయురాలు, సంఘ సేవకురాలు మానుకొండ రూతుమెర్సీ 15వ వర్థంతి సందర్భంగా శుక్రవారం కుష్టు రోగులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. మెర్సీ సోల్జర్స్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కైండ్‌నెస్ సొసైటీ అధ్యక్షులు గట్టిం మాణిక్యాలరావు, ఏపీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు, పాస్టర్ ఎజ్రా తదితరులు ఆమె సేవలను కొనియాడారు. బిషప్ దొడ్డిగర్ల ప్రకాష్, రొక్కాల నాగబుజ్జి, మీసాల శామ్యూల్, పాస్టర్ బజయా అవినాష్ తదితరులు పాల్గొన్నారు.



# సందర్శకులతో కాటన్ పార్కు కళకళ


పర్యాటకులతో కళకళలాడుతున్న కాటన్‌పార్కు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న కాటన్‌పార్కు పర్యాటకులతో కళకళలాడుతోంది. ఎప్పటి నుంచో మూతపడి ఉన్న పార్కును రూ.1.14 కోట్లతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేసి 2023లో ప్రారంభించారు. దీంతో అప్పటి నుంచి పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం వేసవి సెలవులతో పార్కు జనంతో కళకళలాడుతుంది. ముఖ్యంగా పార్కులో ఏర్పాటు చేసిన లైటింగ్ ఆకట్టుకుంటుంది. దీంతో రాత్రిపూట కూడా పర్యాటకుల సంఖ్య మరింత పెరిగింది. పట్టణంలో రెండు ప్రధాన పార్కులు ఉన్నాయి. ఇందులో ఒకటి కాటన్‌పార్కు కాగా, మరొకటి శారదా థియేటర్ వద్ద బాలయ్యపార్కు. కాటన్ పార్కు శిథిలమై దాదాపు మూతపడంతో మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు దృష్టి పెట్టి పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. ప్రణాళికా అభివృద్ధి సంఘం నిధులు కేటాయింపజేశారు. మున్సిపాలిటీ కూడా కొంతమేర జనరల్‌ఫండ్స్ కేటాయించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు.

# పొగతో ఎన్నో అనారోగ్య సమస్యలు


కాయిల్ నుంచి వస్తున్న పొగ

పాలకొల్లు సెంట్రల్: దోమకాటు వల్ల అనారోగ్యానికి గురువుతామనే విషయం అందరికీ తెలుసు. అయితే ఈ సమస్య నుంచి తప్పించుకోవడానికి చాలా మంది మార్కెట్‌లో అందుబాటులో ఉన్న మస్కిటో కాయిల్స్ వాడడం పరిపాటిగా మారింది. చాలా మంది తక్కువ ధరకు వచ్చే మస్కిటో కాయిల్స్‌తో పాటు గత కొంత కాలంగా వస్తున్న మస్కిటో అగరబత్తుల ద్వారా వచ్చే పొగతో దోమలు రావని వాటిని వెలిగిస్తున్నారు. చాలా మంది వీటిని పడుకునే ముందు వెలిగించుకుంటున్నారు. తలుపులు తీసుకుని పడుకుంటే ఆ పొగ బయటకు వెళ్లిపోతుందని అన్ని తలుపులు బిగించే పడుకుంటున్నారు. దీంతో ఆస్తమా ఉన్న రోగులు, చిన్న పిల్లలు, వృద్ధులు శరీరంలో ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వ్యక్తులు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వీటి ద్వారా వచ్చే పొగకు దోమలు చనిపోవడం లేదు. ఆ పొగ ఉన్నంత సేపు అవి మగతగా పడిపోతున్నాయి. పొగ వాసన తగ్గిన తరువాత అవి మళ్లీ తిరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

**పెరిగిపోతున్న నాసిరకం బ్రాండ్‌లు**

ఎంత గొప్ప బ్రాండెడ్ వస్తువులు వాడినా పొగ వల్ల మాత్రం అనారోగ్యాలకు గురికావల్సిందే. అలాంటిది నాసిరకం బ్రాండ్‌లైతే ఇంక ఆ నష్టం మాటల్లో చెప్పలేనిది. మస్కిటో కాయిల్స్, అగర్‌బత్తీలు వివిధ రకాల బ్రాండ్‌ల పేరులతో హైదరాబాద్, బెంగుళూరు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వస్తుంటాయి. అలాగే వివిధ రకాల పరిమళాలతో అనేక రకాల బ్రాండ్‌ల పేరుతో స్థానికంగా కూడా తయారు చేసేస్తున్నారు. వీటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇవి మరింత ప్రమాదకరంగా తయారై ప్రజలు అనారోగ్యాలకు గురికావాల్సి వస్తుంది. మార్కెట్లో గతంలో రీఫిల్స్ 30, 35, 60 రాత్రులు అని విక్రయించేవారు. నేడు హై, లో ఆప్షన్‌లతో 45 ఎంఎల్ రీఫిల్స్ రూ.85ల ధరలతో వస్తున్నాయి. హై లో పెట్టుకుంటే 10 నుంచి 15 రోజులు మాత్రమే వస్తున్నాయి. లో అయితే 20 నుంచి 25 రోజులు వస్తుంటాయి. వీటిని గదికి ఒకటి చొప్పున పెట్టుకుంటుంటారు.

**ఊపిరితిత్తులపై అధిక ప్రభావం**

దోమల నివారణ కొరకు ఉపయోగించే చక్రాలు, అగరబత్తీల పొగ పీల్చడం వల్ల ప్రమాదకరమని వైద్యులు చెపుతున్నారు. తలుపులన్నీ మూసి వెలిగించడం వల్ల కనీసం పొగ బయటకు వెళ్లే మార్గం లేక మొత్తం ఆ గదిలో ఉన్న జనమే పీల్చాల్సి వస్తుంది. దాంతో ఊపిరితిత్తుల్లో పొగ చేరి దగ్గు, ఆయాసం వస్తుంటాయి. దోమల నివారణ కోసం ప్రమాదకరమైన ఉత్పత్తులు వాడే కన్నా ప్రతీ కిటికీకి, గుమ్మాలకు దోమ తెర మెస్‌లు ఏర్పాటు చేసుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. అలాగే ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు.

**దోమల నివారణకు ఎన్నో చర్యలు**

దోమల నివారణకు అధికారులు ఎన్ని లక్షలు ఖర్చు చేస్తున్నా సరే వాటిని మాత్రం నివారించలేకపోతున్నారు. దోమల నివారణకు టిమోపాస్ మందును వాడుతుంటారు. ఇది 10 ఎం.ఎల్ మందులో పది లీటర్లు నీటిని కలిపి డ్రైనేజీల్లో స్ప్రే చేస్తుంటారు. అలాగే పాగింగ్ మెషీన్ల ద్వారా దోమల నివారణకు చర్యలు చేపడుతుంటారు. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉన్నప్పుడు వాటిల్లో ఆయిల్ బాల్స్ వేసి నివారణ చేస్తుంటారు. ఇలా ఎన్ని చేస్తున్నా దోమలను మాత్రం నివారించలేకపోతున్నారు. దీంతో ప్రజలు మస్కిటో కాయిల్స్ వాడి ప్రాణం మీదకు తెచ్చుకుంటున్నారు.